సాగునీటికి పాట్లు


కాలువలో అడ్డులు తొలగిస్తున్న కూలీలు, రైతులు


కాలువలో అడ్డులు తొలగించేందుకు పాట్లు


దుప్పలవలస సమీపంలో అరకొర నీటి ప్రవాహం


కాలువలో వ్యాపించిన తూటిక తివ్వ

ఎచ్చెర్ల మండలంలో నారాయణపురం కుడి కాలువ కింద వరి పంట సాగు చేస్తున్న రైతులు అవస్థలు పడుతున్నారు. గత మూడు సోమవారల్లో పబ్లిక్ గ్రావెన్స్ సెల్‌లో సైతం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం జలవవనరుల శాఖ అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. నారాయణపురం కుడి కాలువ ప్రారంభంలో ఇసుక మేటలు వేశాయి. నీటి ప్రవాహం సజావుగా సాగటం లేదు. ఈ కాలువ కింద సంతకవిటి మండలంలో 4,221, పొందూరు మండలంలో 6,967, ఎచ్చెర్ల మండలంలో 7,175 ఎరకాల ఆయకట్టు ఉంది. ఎచ్చెర్లలో శివారు భూములున్నాయి. పొందూరు మండలం గోకర్ణపల్లి నుంచి సాగునీటి సమస్య ప్రారంభమవుతుంది. కాలువల్లో అడ్డులు తొలగించేందుకు మంగళవారం కూలీలను పెట్టారు. రైతులు సైతం స్వచ్ఛందంగా పాల్గొన్నారు. సాగునీటి సమస్య ప్రధానంగా ఎచ్చెర్ల రైతులును వెంటాడుతుంది. ఈ ఏడాది పంటలు పండే పరిస్థితి లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

క్లుప్తంగా

పరామర్శ..


కిల్లారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కిరణ్‌కుమార్

రణస్థలం: మండలంలోని రావాడ పంచాయతీ లంకపేట గ్రామంలో రావాడ ఎంపీటీసీ కిల్లారి సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు కిల్లారి అప్పలనాయుడు తల్లి ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ బుధవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొర్లె శ్రీనివాసరావు, లంక పాపారావు, దురగాసి రామారావు, దన్నాన హరి, బొమ్మలాట శ్రీరాములు తదితరులు ఉన్నారు.

కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్‌గా సుధీర్‌కుమార్


సుధీర్‌కుమార్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ ప్రజారోగ్య అధికారి (హెల్త్‌ఆఫీసర్) గా డాక్టర్ పి.సుదీర్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ బొడ్డేపల్లి మీనాక్షి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈయన ఇప్పటివరకు కింతలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించేవారు. కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన వెంకటరావుని దూసి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి బదిలీచేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సు.దీర్‌కుమార్ విధుల్లో చేరాల్సి ఉంది.

డాక్టరేట్ ప్రదానం


శ్రీహర్షవర్ధన్

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరానికి చెందిన గాది శ్రీహర్షవర్ధన్ డాక్టరేట్ పట్టాను అందుకున్నాడు. తాను చేపట్టిన 'గ్రీటర్ వాక్స్ మోత్ పాలీమర్–డయజెస్టింగ్ సామర్థ్యంపై పరిశీలన' అనే పరిశోధనకు గాను అసోం అగ్రికల్చరల్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్టు బుధవారం తెలిపారు. ఐసీఆర్ పరీక్షలో టాప్ ర్యాంకు సాధించి డీబీటీ స్కాలర్‌షిప్ ద్వారా ఈ పరిశోధనను పూర్తిచేశారు. అసోం అగ్రికల్చరల్ యూనివర్సిటీకి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బసంతకుమార్ బోరా వారి మార్గదర్శకత్వంలో పరిశోధనను చేపట్టాడు.

నేలను కాపాడుదాం


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

ఎచ్చెర్ల క్యాంపస్: నేల తల్లిని కాపుదుదాం అంటూ ఫరీదుపేట జెడ్పీ పాఠశాల విద్యార్థులు బుధవారం ప్లకార్డులు ప్రదర్శించారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు పాఠశాలలో అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలు, పచ్చదనం–పరిశుభ్రతను తెలుగు ఉపాధ్యాయులు సత్తారు శ్రీనివాసరావు వివరించారు.

మొక్కలు నాటివేత



కార్యక్రమంలో నైర కళాశాల సిబ్బంది, విద్యార్థులు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని నైరా కళాశాలలో జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా తల్లిపేరున మొక్క కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ భారతీలక్ష్మి మాట్లాడుతూ.. ప్రతి ఎన్ఎస్ఎస్ వలంటీర్ తన తల్లి పేరున ఒక మొక్క నాటి తల్లివలే సంరక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాలలో చదువుతున్న వందమంది విద్యార్థులు వంద మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం


రన్నింగ్ నీటి సౌకర్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తాగునీటి సమస్య తీసుకువెళ్లి పరిష్కరించినట్లు ఎంఈఓలు కె.పున్నయ్య, రాజ్‌కిశోర్ తెలిపారు. కొయ్యాం ఉన్నత పాఠశాలను బుధవారం పరిశీలించారు. క్లాస్ వర్కు, మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్ల నిర్వహణను తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా మంగళవారం సైతం మధ్యాహ్న భోజనం పెట్టినట్లు వివరించారు. ఎటువంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని హెచ్‌ఎంకు సూచించారు. విద్యార్థులు మంగళవారం ఖాళీ ప్లేట్లతో నిరసన తెలియజేయటంతో అధికారులు స్పందించారు.

విద్యుత్ సరఫరా నిలుపుదల రేపు

అరసవల్లి: శ్రీకాకుళం నగర పాలక సంస్థ పరిధిలోని పీఎన్ కాలనీ ప్రాంతంలో మెయింటెనెన్స్ పనుల కారణంగా శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఆపరేషన్స్ ఈఈ బయ్యన్నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో పీఎన్ కాలనీ, దత్తాత్రేయ గుడి, కిమ్స్ రోడ్డు, తదితర ప్రాంతాలకు సరఫరా ఉండదని.. వినియోగదారులు గమనించి సహరించాలని కోరారు. అలాగే పాత్రునివలస సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ జేహెచ్‌సీ ఫీడర్ మరమ్మతు పనుల కారణంగా ఏపీ టిడ్కో, జేహెచ్‌సీ పాత్రునివలస ప్రాంతాలకు, కిల్లిపాలెం 11 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతు పనుల కారణంగా కిల్లిపాలెం, కునుకుపేట తదితర ప్రాంతాలకు, శ్రీకాకుళం రూరల్ మండలం కనుగులవానిపేట సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతు పనుల కారణంగా శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఇప్పిలి, బలివాడ, మిత్తన్నపేట, గొల్లపేట, ముక్తంపాలెం, కళ్లేపల్లి, పరదేశిపాలెం, మోపసుబందరు, సాధుపేట, పిజి.పాడు, సిహెచ్‌జి.పాడు, పుక్కళ్లపేట, నర్సయ్యపేట, కనుగులవానిపేట ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ బయ్యన్నాయుడు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

రణస్థలం: ఈ నెల 23న మండలంలోని రణస్థలం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్ములు తొలగించనున్నారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ ఈఈ ఎస్.బయ్యన్నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమ్మసిగడాం, కొండములగాం, వెల్బురాయి, దేవరాపల్లి, అర్జునవలస, ఎర్రవరం సబ్ స్టేషన్ పరిధిలోని ఎర్రవరం, గోసాం, కృష్ణాపురం, తెప్పలవలస, వి.ఎస్.పురం తదితర గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పు రాజ్యాంగ వ్యతిరేకం


రణస్థలం: నిరసన తెలియజేస్తున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ సభ్యులు

రణస్థలం: సుప్రీం కోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పు రాజ్యాంగ వ్యతిరేకమని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి దేబారికి రాము తెలిపారు. మండల కేంద్రంలోని రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి భారత్ బంద్‌కు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో జే.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు పల్ల నీలయ్య, డి.కుసుమ, కె.పైడిరాజు, జి.సింహాద్రి, కె.అప్పారావు, సుభద్ర, రాంబాబు, రాము తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ బయోటెక్నాలజీ పీజీ కోర్సులో చేరండి

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెంటర్ ఫర్ అప్లైడ్ సైన్సెస్ ద్వారా ఈ విద్యా సంవత్సరం నుంచి తీసుకొస్తున్న ఎమ్మెస్సీ మెడికల్ బయోటెక్నాలజీ ప్రొగ్రాం రెండేళ్ల కోర్సును అమలు చేస్తున్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ కోర్సులో చేరి సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, బయోటెక్నాలజీ హెచ్‌ఓడి డాక్టర్ ఎం.ప్రదీప్ కోరారు. పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ప్రభుత్వం అవకాశం కల్పించిందని.. వెంటనే ఏపీపీజీసెట్–2024కు హాజరై అర్హత సాధించిన విద్యార్థులు ఈ ప్రొగ్రాంలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

24న కళలపై చైతన్య సదస్సు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లాలో అంతరించిపోతున్న కళలు, చేతి వృత్తులు అనే అంశంపై (ఇంటాక్) భారత జాతీయ కళలు, సంస్కృతి వారసత్వ సంస్థ, న్యూఢిల్లీ, శ్రీకాకుళం చాప్టర్ ఆధ్వర్యంలో ఈనెల 24న సాయంత్రం నాలుగు గంటలకు చైతన్య సదస్సు జరగనుంది. ఈ విషయాన్ని ఇంటాక్ కన్వీనర్ బుధవారం ఒక ప్రకటలో తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో సభ జరుగుతుందన్నారు.

'మహిళలకు రక్షణ లేకుండా పోతుంది'



శ్రీకాకుళం అర్బన్: వైఎస్సార్ కూడలి వద్ద కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్/శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):

దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోతోందని పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పౌరసంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. కోల్‌కతాలో వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనను నిరసిస్తూ ఆశాదీపిక ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్, జన విజ్ఞాన వేదిక, బ్యాంకు ఉద్యోగుల సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ సంఘాల ప్రతినిధులు శ్రీకాకుళంలోని వైఎస్సార్ కూడలి, అంబేడ్కర్ జంక్షన్ల వద్ద కొవ్వొత్తులతో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఆయా సంఘాల ప్రతిధులు పాల్గొని నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని నినాదాలు చేశారు.


శ్రీకాకుళం అర్బన్: వైఎస్సార్ కూడలి వద్ద నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులు, సంఘాల ప్రతినిధులు


శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

సంక్షిప్తంగా...

ఉచిత శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో ఉచిత స్వల్పకాళిక కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్‌రావు బుధవారం ప్రకటనలో తెలిపారు. స్కిల్ హబ్‌లో ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆన్ కంప్యూటర్ కాన్సెప్ట్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్ కోర్సుల్లో మూడు నెలలపాటు శిక్షణ ఇస్తామన్నారు. 10వ తరగతి విద్యార్హత, 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు గల యువతీ, యువకులు అర్హులన్నారు. విద్యార్థులు ఈ నెల 28వ తేదీలోగా ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో దరఖాస్తు చేసుకోవాలని, శిక్షణ పూర్తయిన విద్యార్థుల కోసం జాబ్ మేళా నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాలకు విద్యార్థులు ఫోన్ నంబర్ 79891 77887ను సంప్రదించాలన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ల పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ప్రగడ దుర్గారావు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బోటనీ, సీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పీజీలో 50 శాతానికిపైగా మార్కులు కలిగి ఉండాలని, ఒకేషనల్ సీఈటీ పోస్టుకు బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ పూర్తిచేసినవారు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 23వ తేదీ సాయంత్రం 4 గంటల్లోపు పూర్తిచేసిన దరఖాస్తులను కళాశాలలో అందించాలని ప్రిన్సిపాల్ కోరారు.

ఉపాధి పనులు గుర్తించాలి

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ నెల 23వ తేదీ నుంచి గ్రామ సభలు నిర్వహించి ఉపాధి హామీ పనులు గుర్తించాలని ఎచ్చెర్ల ఎంపీడీఓ ఆర్.రామాదేవి అన్నారు. ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ కార్యదర్శులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఉపాధి పథకాన్ని గ్రామాల ప్రగతికి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రాధాన్యతాక్రమంలో పనులు గుర్తించి, అంచనాలు రూపొందిస్తే పనులు ఆమోదం లభిస్తుందన్నారు. చెరువులు, వాగులు, కాలువలు, రోడ్డు వంటి వాటిని ఎంపిక చేయాలన్నారు. మండలంలో 28 గ్రామ సచివాలయాల పరిధిలో నగర పాలక సంస్థ పరిధిలో ఉన్న కుశాలపురం, తోటపాలెం మినహా మిగతా అన్ని గ్రామ సచివాలయాల్లో ఉపాధి పనులు అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ రామ్మోహన్, ఏపీఓ శోభాదేవి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: కేశవరావుపేట పంచాయతీ కింతలిమిల్లు వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుమ్ము లక్ష్మమ్మ అనే మహిళ గాయపడింది. కె.మత్స్యలేశం గ్రామానికి చెందిన ఈమె చేపలు విక్రయించేందుకు కేశవరావుపేట వెళుతుండగా, శ్రీకాకుళం వైపు వస్తున్న లగేజ్ వ్యాన్ ఢీకొట్టింది. 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించగా, రిమ్స్ ఔట్ పోస్టు నుంచి వచ్చిన సమాచారం మేరకు ఎచ్చెర్ల పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు.

రచయిత ముత్యం మృతికి సంతాపం

శ్రీకాకుళం కల్చరల్: ప్రముఖ సాహితీవేత్త, దార్శనికుడు డాక్టర్ కె.ముత్యం ఆకస్మిక మృతి తెలుగు సాహిత్యానికి తీరని లోటని తెలుగు రచయితల వేదిక (తెరవే) అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావిల్లి నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి అన్నారు. ఈయన మృతిపై బుధవారం ఓ ప్రకటనలో సంతాపాన్ని ప్రకటించారు. జిల్లాకు చెందిన గరిమెళ్ల, విప్లవ కవి పాణిగ్రహిల సాహిత్యంపై విశిష్ట రచనలు, పుల్లెల శ్యామసుందరరావు జీవిత చరిత్రను ముత్యం రచించారని గుర్తు చేశారు. జిల్లా గిరిజనోద్యమంపై ఎన్నో రచనలు చేసి చైతన్య కలిగించారని అన్నారు. అనేక సాహిత్య సభలలో పాల్గొన్నారన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఎచ్చెర్ల: కస్తూర్బా పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు మంచి ఫలితాలను సాధించాలని ఉమెన్ అండ్ చైల్డ్ వేల్ఫేర్ కలెక్టర్ ప్రసన్నరాణి అన్నారు. బుధవారం మురపాక కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి వెనుకబడినవారి అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఏఓ సుధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బైరిపల్లం బట్టిపై నిర్లక్ష్యం!


బైరిపల్లంబట్టి వద్ద కంట కొట్టుకుపోయిన దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని బైరి గ్రామంలో గల బైరిపల్లం బట్టిపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఏటా ఆయకట్టుకు సాగునీరందించే ఈ బట్టిని పట్టించుకోకపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఆ కాలువ ద్వారా సుమారు 600 ఎకరాలకు సాగునీరు అందుతోంది. పంట పొలాలకు ఎగువన ఉన్న రైతులు దీన్ని ఉపయోగించి వారి పొలాలకు నీరు అందిస్తుంటారు. అయితే ఒక్కోసారి గట్టు కోతకు గురవ్వడంతో బైరిదేశీ గెడ్డలోకి నీరంతా కొట్టుకుపోతుంది. దీనివల్ల మిగతా రైతులకు నష్టం వాటిల్లుతుంది. ప్రధానంగా వంశధార కెనాల్ గుండానే బైరిదేశీగడ్డకు సాగునీరు వెళ్తుంది. అక్కడ నుంచి బైరిపల్లంబట్టికి సాగునీరు పంపించినప్పటికీ అక్కడ రైతులు ఏర్పాటు చేసుకున్న కంట వద్ద ఇసుక బస్తాలతో కూడిన మూటలు వేసి కంట ఏర్పాటు చేసినప్పటికీ ఫలితం ఉండం లేదు. వరద ఉద్ధృతంగా వస్తే బైరిదేశి గెడ్డలోకే కొట్టుకు పోతుంది. దీంతో సాగునీరు పంట పొలాలకు అందించలేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బైరిపల్లం బట్టిద్వారా రైతులకు పూర్తిస్థాయిలో సాగు నీరు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీకి ఎంపైర్‌గా సూరిబాబు


ఎస్.సూరిబాబు

శ్రీకాకుళం న్యూకాలనీ: అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లాకు చెందిన సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ సంపతిరావు సూరిబాబు నియామకం అయ్యారు. హైదరాబాద్ వేదికగా ఈనెల 25వ తేదీ వరకు జరగనున్న జూనియర్ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్–2024 పోటీలకు సూరిబాబు న్యాయ నిర్ణేతగా వ్యవహరించనున్నారు. ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌లో 15 దేశాలకు చెందిన క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జిల్లాలోని ఎచ్చెర్ల మండలం చిలకపాలెం జెడ్పీహెచ్ స్కూల్ పీడీగా పనిచేస్తున్న సూరిబాబు బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా సీఈఓగా, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్, జిల్లా పీడీ–పీఈటీ అసోసియేషన్‌లో కీలకభూమిక వహిస్తున్నారు. ఈయన నియామకం కావడంపై బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్, కార్యదర్శి మెట్ట అశోక్ కుమార్, చిలకపాలెం హైస్కూల్ హెచ్‌ఎం చౌదరి లీలావతి, జిల్లా పీఈటీ సంఘం అధ్యక్షుడు ఎంవీ రమణ, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, బాడ్మింటన్ సంఘ ప్రతినిధులు, పీడీలు హర్షం వ్యక్తం చేశారు.

వినాయక చవితికి పందిరిరాట


పందిరిరాట ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఇలిసిపురం కూడలిలోని రైతుబజారుకు ఎదురుగా ఉన్న స్థలంలో హారికా కన్‌స్ట్రక్షన్స్ అధినేత హారికా ప్రసాద్, లయన్స్‌క్లబ్ ఆఫ్ హర్షవిల్లి జోనల్ చైర్‌పర్సన్ కరణం శోభారాణి దంపతులు పందిరిరాట పూజలు బుధవారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోనే అతిపెద్ద వినాయక విగ్రహాన్ని నెలకొల్పి రోజూ అన్నదానం, ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాలలో ఇలిసిపురం యూత్ సభ్యులు అందరూ ఈ ఏడాది కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఇలిసిపురం మెహ యూత్ సభ్యులు అప్పు, వాసు, భాస్కర్, నాని, మోహన్, సోము ఉన్నారు.

విద్యార్థులు సేవా నిరతి కలిగి ఉండాలి



రక్తదానం చేస్తున్న విద్యార్థి మహేష్

శ్రీకాకుళం కల్చరల్: విద్యార్థులు చదువుతో పాటు సేవా నిరతి కలిగి ఉండాలని, అప్పుడే నవ సమాజం ఏర్పడుతోందని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. ఎల్.ఎన్.పేటకు చెందిన బి.శంకరరావుకు ప్లేట్ లెట్స్ కౌంట్ 40 వేలకు పడిపోవడంతో ద్వారకామయి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆతని ఓ పాజిటివ్ ఎస్డీపీ అవసరం కావడంతో అసరవల్లి బంపాడ వీధికి చెందిన వి.మహేష్ ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. దీన్ని రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రంలో అందించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ ప్రతినిధి ఉమాశంకర్, సురేష్, నారాయణ, మేనేజర్ ఆయేషా బేగం, సుప్రజరౌత్, అల్లాడ నవీన్‌లు అభినందించారు.

అర్హులందరికీ ఓటు హక్కు


మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మణమూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామం యూనిట్‌గా అర్హులందరికీ ఓటు హక్కు కల్పించనున్నట్లు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కొవ్వాడ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్‌వీఎస్ లక్ష్మణరావు అన్నారు. ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలో ఎచ్చెర్ల మండల బూత్ లెవల్ అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. స్థానిక సంస్థలు ఎన్నికలు వచ్చే నాటికి పక్కాగా ఓటర్ జాబితాలు సిద్ధం చేయాలన్నారు. ప్రస్తుతం 18 ఏళ్ల దాటిన వారితో ఫారం–6 దరఖాస్తు చేయించాలని సూచించారు. శత శాతం ఓటు హక్కు కల్పనే ఎన్నకల సంఘం లక్ష్యమన్నారు. ఓటర్ల జాబితాపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామన్నారు. తహసీల్దార్ ఎ.సింహాచలం, అధికారులు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన ఎం.వి.స్వరూప్


జగన్‌మోహన్‌రెడ్డితో స్వరూప్

శ్రీకాకుళం (పీఎస్‌కాలనీ): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.వి.స్వరూప్ తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీగా బొత్స సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. పాడేరు నియోజకర్గంలో ప్రజాప్రతినిధులను సమన్వయపరిచే బాధ్యతను సక్రమంగా చేసినందుకు జగన్ మెచ్చుకున్నారని స్వరూప్ చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేసేందుకు ఫిజిక్స్, హిస్టరీ సబ్జెక్టుల్లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పైడి వెంకటలక్ష్మీ నారాయణరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. పీజీలో 50 శాతం మార్కులు ఉన్న వారు అర్హులన్నారు. గురువారం సాయంత్రం లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.